సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. 8లో



నేరాలను ఉపేక్షించం..

క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదని, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ ఆదేశించారు. 8లో



క్రికెట్ విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్ : విద్యుత్ శాఖ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో ఏపీఈపీడీసీఎల్ (విశాఖ) జట్టు విజేతగా నిలిచింది.

న్యూస్‌రీల్

దట్టంగా పొగ మంచు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లాలో **ఉష్ణోగ్రతలు** పెరుగుతున్నప్పటికీ మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకూ **మంచు తీవ్రంగా కురుస్తోంది.** ఆదివారం ముంచంగిపుట్టులో 13.0 డిగ్రీలు, అనంతగిరిలో 14.3 డిగ్రీలు, చింతపల్లిలో 17.6 డిగ్రీలు, దుంబ్రిగుడలో 14.3 డిగ్రీలు, జి.మాడుగులలో 14.3 డిగ్రీలు, జీకే వీధిలో 15.3 డిగ్రీలు,హుకుంపేటలో 17.5 డిగ్రీలు,కొయ్యూరులో 21.2 డిగ్రీలు, పాడేరులో 17.0 డిగ్రీలు, పెదబయలులో 14.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్,వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ల తనిఖీ



ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న గణేష్ కుమార్

రాజవొమ్మంగి : మండలంలో జడ్డంగిలోని జీసీసీ మండల లెవెల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్‌ఎస్)లను ఆదివారం సివిల్‌సప్లయ్స్ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌకడిపోలకు, మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాల్సిన బియ్యం నిల్వలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన నూనె, బెల్లం తదితరాలను తనిఖీ చేశారు. చిన్న చిన్న తేడాలను గమనించామని, జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని గణేష్ తెలిపారు. ఆయన వెంట జీసీసీ మేనేజర్ విజయలక్ష్మి, స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ఉన్నారు.

ఆడుకుంటూ అనంత లోకాలకు..

- సిమెంట్ ఇటుక తలపై పడి బాలుడి మృతి



భీమేశ్వరరావు(ఫైల్)

కొయ్యూరు: తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఉండగా జరిగిన ప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన కొమ్మిక పంచాయతీ బొర్రంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన మర్రి రాజుబాబు కుమారుడు భీమేశ్వరరావు (5) ఆదివారం ఉదయం తన ఇంటికి సమీపంలో మరో ఇంటి గోడపక్కన ఆడుకుంటూ ఉండగా ఆ గోడలో ఉన్న సిమెంట్ ఇటుక జారి తలపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలుడిని హుటాహుటిన కంఠారం పీహెచ్‌సీకి తల్లిదండ్రులు తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. రాజుబాబు దంపతులకు ఆరుగురు సంతానం కాగా, వారిలో భీమేశ్వరరావు మరణించాడు. దీంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్ల దాఖలకు నేడు ఆఖరు

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్లు దాఖలకు సోమవారం చివరి రోజు కాగా.. ఇప్పటివరకు ఎనిమిది మంది నామినేషన్లు వేశారు. ఆఖరి రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. నామినేషన్లను ఈనెల 11న పరిశీలన చేస్తారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

● కూటమి కుట్రకు కేకేలైన్ బలి

వాల్తేరుకు వంచన



కూటమి కుట్రలకు వాల్తేరు డివిజన్ బలైపోయింది. ఆదాయార్జనలో నంబర్ వన్ డివిజన్‌గా నిలిపిన కేకే లైన్‌ను విశాఖకు కానివ్వకుండా కూటమి ఎంపీ కుయుక్తులు పన్నారు. కేవలం పలాస రైల్వే స్టేషన్ కోసం కొత్తవలస–కిరండూల్ రైల్వే లైన్‌ను అప్పనంగా అప్పగించేశారు. కేకే లైన్ విశాఖ జోన్‌లోనే ఉన్నా.. రవాణా చార్జీల వసూళ్లన్నీ రాయగడ డివిజన్‌లో జరగనుండడంతో ఆదాయ పంపకాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో విశాఖవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు.

- పలాస కోసం ఆదాయ వనరును అప్పగించేశారు!
- కేకే లైన్ నుంచి కొత్త జోన్‌కి ఆదాయంపై అనుమానాలు
- విశాఖ నుంచి బయలుదేరే రైళ్లు శ్రీకాకుళం నుంచి నడిపేందుకు పావులు
- తొలుత గరీబ్ రథ్, తర్వాత గోదావరికి ప్రతిపాదనలు పంపిన నేతలు
- మరోవైపు వాల్తేరు రైళ్లపై కొనసాగుతున్న దక్షిణ మధ్య రైల్వే వివక్ష
- 230 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్న ఎల్‌టీటీ 10 రోజులు రద్దు



రైల్వే జోన్ వరం కాదు.. శాపం అంటూ చంద్రబాబు గతంలో చేసిన ట్వీట్

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర కేబినెట్ ఆమోదంతో విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అయినప్పటికీ ఉత్తరాంధ్ర వాసుల్లో కించిత్ కూడా ఆనందం లేకుండా చేసింది కూటమి ప్రభుత్వం. సుమారు శతాబ్దంన్నర చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను కాలగర్భంలో కలిపేసింది. గుండెకాయ లేకుండా పునర్విభజన చేసింది. ప్రస్తుతం ఉన్న డివిజన్‌కు కొండంత ఆదాయం తెచ్చే కేకే లైన్‌ను ఈస్ట్‌కోస్ట్ జోన్‌కు అప్పగించేసింది. దీంతో కొత్తగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా జోన్‌కు, విశాఖ డివిజన్‌కు ఆదాయ మార్గాలు దాదాపు తగ్గుముఖం పట్టినట్లే. దీనికి కారణం కూటమి ఎంపీల ఒత్తిళ్లేనని స్పష్టమవుతోంది. తన జిల్లాలో రైల్వేపై పట్టు సాధించేందుకు ఒక ఎంపీ ఈ అడ్డగోలు విభజనకు రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాసను విశాఖపట్నం డివిజన్‌కు ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే కేకే లైన్‌ను తమకు అప్పగిస్తే.. పలాసని వదులుకుంటామని ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ అధికారులు ప్రతిపాదన ముందుంచారు. మరో మాట లేకుండా తన స్వలాభం కోసం అంగీకారం తెలపడంతో ఈ అడ్డగోలు విభజన జరిగింది.

మూలధన నిధులన్నీ.. ఆ లైన్‌కేనా.?

జోన్ అభివృద్ధి కోసం నాలుగేళ్లపాటు ప్రతి బడ్జెట్‌లోనూ మూలధన పెట్టుబడి కింద నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో 57 కిమీ మేర అమరావతి రైల్వే లైన్ ఇప్పుడు ప్రతిపాదనల్లో ఉంది. రూ.3 వేల కోట్ల వ్యయంతో ఈ లైన్ నిర్మాణం జరగనుంది. అంటే.. ప్రతి బడ్జెట్‌లో వచ్చే నిధులు, జోన్ ఆదాయం మొత్తం అమరావతి లైన్ హరించేస్తుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

ఆదాయ పంపకాలపై స్పష్టత లేదు

వాస్తవానికి **కేకే లైన్ రెండు** డివిజన్లకు సరిహద్దు **మధ్య భాగంగా ఉంది. ఈ లైన్ సిం**హభాగం కార్యకలా**పాలన్నీ విశాఖపట్నం డివిజన్ పరి**ధిలోనే ఉంటాయి. **అయితే కేకే లైన్‌లో సరకు రవాణా** ఎక్కువగా జరుగు**తుంటుంది. దీనికి సంబంధించిన** రవాణా వసూళ్లన్నీ **కిరండూల్ సెక్షన్‌లో నిర్వహిస్తారు.** అక్కడ చార్జీల చెల్లింపులు **జరిగిన తర్వాత గూడ్స్ రైళ్లు** విశాఖపట్నం వైపు **సరకుతో వస్తాయి. ఈ లెక్కన చూస్తే** రెండు డివిజన్లకు ఆదాయం చెందాల్సి ఉంటుంది. కానీ, పంపకాలు ఉన్నాయా లేదా అనే దానిపై రైల్వే బోర్డు స్పష్టత ఇవ్వలేదు. అలాగే కేకేలైన్‌లో ఎక్కువ కొండ చరియలు విరిగిపడుతుంటాయి. ఈ నిర్వహణ బాధ్యతలు ఎవరు చేపడతారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, కేకే లైన్ పరిధిలో విధులు నిర్వర్తించే వారి పరిస్థితి దయనీయంగా మారనుంది. బదిలీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సెలవులు దొరికే పరిస్థితులు కూడా ఉండబోవని చెబుతున్నారు.

రామ్మోహన్‌నాయుడు కొత్త ఎత్తులు



గతంలో వాల్తేరు కోసం రామ్మోహన్ నాయుడు ట్వీట్లు

వాల్తేరు డివిజన్‌ను ఇవ్వకపోతే ఉద్యమిస్తామని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబుతో సహా కూటమి నేతలు బీరాలు పలికారు. కేంద్రంలోని బీజేపీని చీల్చిచెండాడతామని హెచ్చరించారు. వాల్తేరు డివిజన్‌ను రద్దు చేయకూడదని దీక్షల పేరుతో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హడావుడి చేశారు. ఇప్పుడు వాల్తేరు డివిజన్‌ను విడదీయడంతో పాటు కీలకమైన కేకే లైన్‌ను విశాఖ డివిజన్‌కు లేకుండా చేస్తే, జోన్, కొత్త డివిజన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేయడంపై ఉత్తరాంధ్ర వాసులు మండిపడుతున్నారు. అలాగే విశాఖ నుంచి నడిచే రైళ్లను శ్రీకాకుళం, పలాస వరకు పొడిగించాలని ప్రతిపాదనలు రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ముందుగా విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్న గరీబ్‌రథ్‌ను శ్రీకాకుళం వరకు పొడిగించాలని ఎంపీ డిమాండ్ చేస్తున్నారు. దీనిపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇది పూర్తయ్యాక గోదావరి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వంటి మరిన్ని రైళ్లను పలాస లేదా శ్రీకాకుళం వరకు పొడిగించేందుకు ఎంపీ ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే కేకే లైన్ పోయినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

సందట్లో సడేమియా.. సౌత్ సెంట్రల్ కుట్ర!



విశాఖపట్నం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్

ఓవైపు సరిహద్దుల విభజనలతో వాల్తేరు డివిజన్ సతమతమవుతుంటే.. దక్షిణ మధ్య రైల్వే అధికారులు తమ వివక్షను వీడటం లేదు. విశాఖ నుంచి నడిచే ముఖ్యమైన రైళ్లను సైతం ఏదో ఒక సాకుతో రద్దు చేస్తున్నారు. గతంలో 150 నుంచి 175 శాతం ఆక్యుపెన్సీతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రత్నాచల్, సింహాద్రి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ట్రాక్ మరమ్మతులు, ఆధునికీకరణ పనులు, మెయింటెనెన్స్ అంటూ కారణాలు చూపుతూ చాలా రోజులు రద్దు చేశారు. తాజాగా అత్యంత రద్దీగా నడుస్తున్న విశాఖపట్నం - ముంబై (185190/18520) ఎల్‌టీటీ రైలుపై కక్షగట్టారు. నాన్–ఇంటర్‌లాకింగ్ పనుల పేరుతో ఈ నెల 10 నుంచి 20 వరకు ఈ రైలును రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ రైలుకు 20వ తేదీ వరకు రెండువైపులా 230 శాతం ఆక్యుపెన్సీ ఉంది. అయినప్పటికీ దక్షిణ మధ్య రైల్వే అధికారులు కుట్రపూరితంగా వ్యవహరించి, వాల్తేరు డివిజన్ ఆదాయానికి గండికొట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వాల్తేరు డివిజన్ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

మన్యం బంద్ విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



బంద్ కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,జెడ్పీటీసీ బాలయ్యపడాల్ తదితరులు

చింతపల్లి: గిరిజన చట్టాలను సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించనున్న మన్యం ప్రాంత బంద్‌ను విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. ఆదివారం చింతపల్లిలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యతో కలసి బంద్ కరపత్రాలను విడుదల చేశారు.అనంతరం అంతర్లలో వాహనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు పర్యాటకం పేరుతో చట్టాలను సవరించే కుట్రపన్నిందని ఆరోపించారు.గిరిజన చట్టాలను కాపాడుకోవడానికి గిరిజన సంఘాలు,ఆదివాసీల ఆధ్వర్యంలో జరిగే ఈ నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి గణబాబు, జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్,నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కంకిపాటి రామారావు, యువజన నాయకులు కవడం ఈశ్వర్‌పడాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన గిరిజన క్రీడాకారుడు

పరుగు పోటీల్లో ఒక వెండి, రెండు కాంస్య పతకాలు



ఇండియన్ మాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ వరప్రసాద్ చేతుల మీదుగా పతకం, సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రసాద్

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి చెందిన గిరిజనుడు కుర్తాడి ప్రసాద్ అథ్లెటిక్స్‌లో మెరిశాడు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం అళ్వార్‌లోని రాజ్ రిషి కాలేజీ క్రీడా మైదానంలో నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2025 పరుగు పోటీల్లో మన రాష్ట్రం నుంచి పాల్గొన్న కుర్తాడి ప్రసాద్ సత్తా చాటాడు. 800 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి, 400,1500 మీటర్ల పరుగులో తృతీయ స్థానాల్లో నిలిచి కాంస్య పతకాలు సాధించాడు. పతకాలతో పాటు సర్టిఫికెట్లను ఇండియాన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మంగా వరప్రసాద్ చేతుల మీదగా ప్రసాద్‌కు అందుకున్నాడు. త్వరలో శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ పరుగు పోటీలకు ప్రసాద్ ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో జరిగే పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సహాయం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. శ్రీలంకలో జరిగే పోటీలలో ప్రతిభ కనబరుస్తానని చెప్పాడు.

రేపటి నుంచి మినీ మేడారం జాతర

- మారాయిగూడెంలో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ
- తరలి రానున్న మూడు రాష్ట్రాల సరిహద్దు భక్తులు



జాతరకు ముస్తాబయిన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

ఎటపాక: మినీ మేడారంగా పేరొందిన మారాయిగూడెంలో సమ్మక్క, సారలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది.ఆంధ్రా సరిహద్దున ఉన్న తెలంగాణా రాష్ట్రం దుమ్ముగూడెం మండలంలోని మారాయిగూడెంలో ఈనెల 11 నుంచి మార్చి 15 వరకు ఈ జాతర జరగనుంది. ఈ జాతరకు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్,తెలంగాణా రాష్ట్రాల సరిహద్దు గిరిజన గ్రామాల నుంచి వేలాది మంది తరలిరానున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న మారాయిగూడెంలో ఏటా జాతర ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈజాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

జాతర కార్యక్రమాలు : ఈనెల 11న జాతర వైభవంగా ప్రారంభమవుతుంది.12వ తేదీ రాత్రి 10గంటలకు దేవత నిశానులు,సారలమ్మను గుడికి తీసుకొస్తారు. 13న నిండు జాతర మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు వనదేవతను గుడికి తీసుకొస్తారు.సాయంత్రం 4గంటలకు తల్లి దేవతను గుట్ట నుంచి గుడికి తీసుకొస్తారు. 14న శంకు పండగ, దేవుని దర్శనం, 15న తల్లి దేవత తిరిగి గుట్టకు వెళ్లడంతో జాతర మహోత్సవం ముగుస్తుంది.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. గంగదేవత

- సీకరి పంచాయతీలో 11న ప్రధాన జాతర
- 3వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు పూజలు



పెదబయలు: గిరిజనుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన గంగదేవత ప్రధాన ఉత్సవం మండలంలోని సీకరి గ్రామంలో 11వ తేదీన నిర్వహించనున్నారు. మాఘమాసంలో ఈ ఉత్సవాన్ని తొమ్మిది రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 3న ప్రారంభమైన జాతర 11న జరిగే ప్రధాన ఉత్సవంతో ముగుస్తుంది. మూడేళ్లకు ఒకసారి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాన్ని సీకరి పంచాయతీ ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. గ్రామ సమీపంలోని గంగుడిబైలులో గల వట వృక్షం పొదల్లో ఉన్న గంగదేవతను ఉత్సవంలో భాగంగా గ్రామ పూజారి ఇంటికి డప్పు వాయిద్యాలతో చేర్చి రోజూ పూజలు చేస్తున్నారు. పంచాయతీలో 14 గ్రామాల ప్రజలు ఎంతో భక్తితో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. గంగదేవత పండగ జరిగే ఏడాది సీకరి పంచాయతీలో సంక్రాంతి పండగను వాయిదా వేస్తారు. ఉత్సవం ముగిసిన తరువాతే సంక్రాంతి జరుపుకొంటారు. గంగదేవత పండగలో ప్రధాన ఉత్సవం సందర్భంగా 11 తేదీన 40 నుంచి 50 అడుగుల పొడవైన కొరతకొయ్యను తయారు చేసి, దానికి బాలుడ్ని కట్టి పైకి ఎత్తుతారు.ఈ బాలుడిని దైవంగా భావిస్తారు. ప్రధాన ఉత్సవం నాడు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సోమ,మంగళవారాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. 11 తేదీన గంగదేవతను మళ్లీ పూజారి గంగుడిబైలు గుడిలో చేర్చడంతో పండగ ముగుస్తుంది.

12 నుంచి సంక్రాంతి పండగ

సీకరి పంచాయతీలో గంగదేవత ఉత్సవం సందర్భంగా వాయిదా వేసిన సంక్రాంతి పండగను బుధవారం నుంచి నిర్వహించనున్నారు.

పర్యాటకుల జోష్

- కళకళలాడిన టూరిస్ట్‌స్పాట్‌లు
- పోటెత్తిన సందర్శకులు

కనుచూపు మేర ప్రకృతి సొబగులు పర్యాటకులను కట్టిపడేశాయి. అబ్బుర పరిచిన రమణీయ దృశ్యాలు సందర్శకుల హృదయాలను పులకింపజేశాయి. జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన టూరిస్టులు అక్కడి అందాలను చూసి మైమరిచిపోయారు. లంబసింగి, తాజంగి, చెరువుల వేనం, కొత్తపల్లి, చాపరాయి జలపాతాలు, ఇతర టూరిస్టు స్పాట్‌లకు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉత్సాహంగా గడిపారు.



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ..

చింతపల్లి: ఆంధ్రా కాశ్మీర్ లంబసింగిలో పర్యాటకులు సందడి చేశారు. చలి కాస్త తగ్గినప్పటికీ మంచు తీవ్రతలో ఎటువంటి మార్పులు లేకపోవడంతో పర్యాటకులు ప్రతి వారం వలే ఈ ఆదివారం కూడా కుటుంబాలతో తరలివచ్చారు. లంబసింగి జంక్షన్, తాజంగి జలాశయంతో పాటు చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలకు ఫిదా అయి ఫొటోలు,సెల్ఫీలతో సందడి చేశారు.

కొత్తపల్లి జలపాతం వద్ద ..

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. పెద్ద పెద్ద బండరాళ్లపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహంలో గంటల తరబడి కేరింతలతో స్నానాలు చేశారు.ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వ్యూపాయింట్‌ల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

చాపరాయిలో వద్ద..

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. పలువురు టూరిస్టులు జలపాతంలో కేరింతలతో జలకాలాడారు. అనంతరం ఇక్కడకు సమీపంలో అంజోడలో అటవీశాఖ ఏర్పాటు చేసిన అరకు పైనరీని సందర్శించారు.



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్ప తోటల్లో..

హుకుంపేట: తూర్పు కనుముల్లో అరుదుగా కనిపించే ఉప్ప తోటల్లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. హరివిల్లును తలపించేలా ఉన్న ఈ చెట్ల రంగులను చూసి పలువురు ఆశ్చర్యపోయారు. పర్యాటకులు భారీగా తరలిస్తువన్నప్పటికీ ఐటీడీఏ అధికారులు ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.



చాపరాయి వద్ద సందర్శకులు

క్లుప్తంగా

ఆటో బోల్తా - 11 మందికి తీవ్ర గాయాలు



గాయపడిన వారికి రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: చౌడుపల్లి నుంచి కొయ్యూరు సంతకు ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఆదివారం బూదరాళ్ల పంచాయతీ ముకుడుపల్లి–చౌడుపల్లి మధ్య అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రాజేంద్రపాలెం ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో మర్రి దేవి, పాంగి మల్లేశ్వరరావు, గెమ్మెలి శాంతి, పాలిక రాధ, కొర్రా లక్ష్మి, బి.రామారావు, నారాయణమ్మ, కె.రాజారావు, బాలమ్మ, పి.నందిని, రేఖమ్మ ఉన్నారు.

అప్పు తీర్చలేదని ఇంటికి తాళం

- లచ్చన్నపాలెంలో ఘటన
- కొడుకు, మనుమరాళ్లతో ఆరుబయటే నిద్రించిన బాధితురాలు



ఇంటి బయట నిద్రించిన ఈశ్వరమ్మ, పెద్దకొడుకు, మనుమరాళ్లు

మాకవరపాలెం : కొడుకు తీసుకున్న అప్పు తీర్చలేదంటూ తల్లి నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసిన ఘటన మండలంలోని లచ్చన్నపాలెంలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలాఉన్నాయి. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన సడింపల్లి ఈశ్వరమ్మకు ఇద్దరు కొడుకులు. వీరిలో చిన్నకొడుకు హరి గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేసేవాడు. అయితే గతేడాది ఫిబ్రవరి 1న ఇదే గ్రామ శివారులో హత్యకు గురయ్యాడు. హరి మరణించిన అనంతరం గ్రామానికి చెందిన లాలం శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, ఈ నగదు ఇవ్వాలంటూ తల్లి ఈశ్వరమ్మను గత కొన్ని రోజులుగా శ్రీను అడుగుతున్నాడు. తనకు తెలియదని చెప్పినా వినకుండా తనతో బలవంతంగా సంతకాలు పెట్టించినట్టు ఈశ్వరమ్మ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అప్పు తీర్చకపోవడంతో ఆదివారం శ్రీను తన ఇంటికి తాళం వేసినట్టు తెలిపింది. దీంతో రోడ్డున పడ్డామని వాపోయింది. ఇంటికి తాళం వేయడంతో ఈశ్వరమ్మ, పెద్ద కొడుకు, ఇద్దరు పిల్లలతో ఆరుబయటే ఉండడమేగాక రాత్రికి ఇంటి బయటే నిద్రించాల్సి వచ్చింది. ఉన్నట్టుండి పిల్లలతో ఎక్కడికి వెళ్లేదని, తమకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది.

పంట పుష్కలం.. ధర నిష్ఫలం

రైతు బతుకు ఎప్పుడూ జూదమే. ప్రకృతిని నమ్మి పెట్టుబడి పెడతాడు. సుఖమెరుగక రేయింబవళ్లు శ్రమిస్తాడు. అందిన కాడికి అప్పులు చేసి సాగు చేస్తాడు. ఈ దశలో తొలి గండం తుపాన్లు.. ప్రకృతి వైపరీత్యాల రూపంలో రైతును భయపెడుతుంది. ఒకవేళ ఆ గండం దాటగలిగితే మరో ప్రమాదం కబళించాలని చూస్తుంటుంది. అదే.. మార్కెట్ ఒడిదుడుకుల వైకుంఠపాళి సర్పం. హఠాత్తుగా పడిపోయే ధరలు.. మార్కెట్‌కు వెల్లువెత్తే సరకు వంటివి రైతు తీసుకొచ్చే సరకుపై పెను ప్రభావం చూపుతాయి. పలు ప్రాంతాల నుంచి రైతులంతా ఒకే రకం సరకు తీసుకొస్తే ధర పడిపోతుంది. ఆదివారం దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్లో అదే జరిగింది. ఇక్కడి శ్రీరాంపురం, దేవరాపల్లి తదితర ప్రాంతాల రైతులు తీసుకొచ్చిన టమాటా ధర అమాంతం పడిపోయి రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. దీనికి కారణం మార్కెట్‌కు టమాటాలు ముంచెత్తడమే.

- ఘోరంగా పతనమైన టమాటా ధర
- కిలో రూ. 2కు పడిపోయిన వైనం
- దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో దారుణ పరిస్థితి
- భారీగా నష్టపోయిన రైతులు



దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌కు అధిక మొత్తంలో వచ్చిన టమాటా నిల్వలు

దేవరాపల్లి: స్థానిక హోల్‌సేల్ మార్కెట్లో టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. వారం రోజుల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధర ఆదివారం ఘోరంగా పతనమైంది. స్థానిక మార్కెట్‌లో కిలో టమాటా రూ. 2కి పడిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. 30 కేజీల ట్రే రూ. 80 నుంచి రూ. 90 పలికింది. ఈ ధరకు కూడా కొనేందుకు కూడా ఎవరూ మొగ్గు చూపక పోవడంతో గంటల తరబడి ఎదురు చూసి గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పెట్టుబడి సొమ్ము సరికదా కనీసం కూలీ ధర, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేకపోయినా వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడితో సాగు చేసిన రైతుకు శ్రమే మిగిలుతోంది. రెండు నెలల క్రితం టమాటా ధరలు ఆకాశాన్నంటడంతో రైతులు టమాటా సాగుపై దృష్టి సారించారు. దిగుబడి ఆశాజనంగా ఉండటంతో నాలుగు రూపాయలు వెనకేసుకుందామని ఆశించిన తరుణంలో నిరాశే మిగిలింది. పంట చేతికందే సమయంలో ధర లేక పోవడంతో తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారు. మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు రాని దయనీయ పరిస్థితి నెలకొనడంతో కొందరు పొలాల్లోనే టమాటాను విడిచిపెడుతున్నారు. మార్కెట్‌కు అధిక మొత్తంలో సరకు రావడం, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు రాకపోవడమే ధరల పతనానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మార్కెట్లో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న టమాటా రైతులు

సుమారు వెయ్యి ఎకరాల్లో టమాటా సాగు..

దేవరాపల్లి మండలంలో దేవరాపల్లి, రైవాడ, శ్రీరాంపురం, శంభువానిపాలెం, కాశీపురం, నాగయ్యపేట, సీతంపేట, మారేపల్లి, చేనులపాలెం, పెదనందిపల్లి, చిననందిపల్లి, తెనుగుపూడి తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో టమాటా సాగు చేశారు. ఎకరా సాగుకు ఎరువులు, సస్యరక్షణ కలిపి సుమారు రూ. 30 వేల వరకు ఖర్చు కాగా ప్రస్తుతం కనీసం రూ. 5 వేలు వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి..

కాయగూరల మార్కెట్‌లో పండించిన పంటను నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పండిన పంటలు నిల్వ చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థానిక మార్కెట్‌లో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకోవాలని కాయగూరల రైతులు ముక్త కంఠం కోరుతున్నారు.

రవాణా చార్జీలు కూడా రాలేదు..



ఎకరం విస్తీర్ణంలో టమాటా సాగు చేశాం. వారం, పది రోజుల క్రితం వరకు టమాటా ధర క్రేటు సుమారు రూ. 300 నుంచి రూ.400 వరకు పలికింది. ఆదివారం దేవరాపల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో క్రేటు రూ. 80 మాత్రమే పలికింది. ఈ ధరకు కూడా బలంతంగా అమ్మాల్సిన పరిస్థితి దాపురించింది. కనీసం రవాణా చార్జీలు కూడా రావడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొగ్గ అవతారం, టమాటా రైతు, శ్రీరాంపురం

శ్రమే మిగులుతోంది..



ఆరుగాలం కుటుంబమంతా కష్టపడి సాగు చేస్తే చివరకు శ్రమే మిగులుతోంది. ఎకరాకు సుమారు రూ. 30 వేల వరకు పెట్టుబడి పెడితే కనీసం రూ. 5 వేలు వచ్చే పరిస్థితి లేదు. కిలో టమాటా రూ. 2 పలకడం దారుణం. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నా మద్దతు ధర మాత్రం పెరగడం లేదు. ప్రభుత్వం స్పందించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలి.

– గేదెల సూరిబాబు, టమాటా రైతు, దేవరాపల్లి

టమాటా.. వంకాయ ధరలు పడిపోయాయి



టమాటాతో పాటు వంకాయ ధరలు కూడా దారుణంగా పడిపోయాయి. 1 క్రేటు తెల్ల వంకాయల ధర రూ. 100 మాత్రమే పలికింది. ఉదయం 6 గంటల మార్కెట్‌కు రాగా 11 గంటల వరకు చూసి తప్పని పరిస్థితిలో రూ. 100కి అమ్ముకున్నాను. కాయగూరల రైతులంతా పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– గోకాడ ఈశ్వరరావు, వంగ రైతు, దేవరాపల్లి

ముగిసిన కరాటే పోటీలు



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సినీనటుడు సుమన్

విశాఖ స్పోర్ట్స్: అంతర్జాతీయ కరాటే పోటీలు పోర్ట్ స్టేడియంలో ముగిశాయి. కాటా, కుమిటీ అంశాల్లో మెన్,వుమెన్‌తో పాటు బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఆదివారం పోటీల ముగింపు కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ హాజరై విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ లందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న వారందరూ విజేతలే అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నాయుడు, కోచ్‌లు రిఫరీలు పాల్గొన్నారు.

జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఎదురుచూపు

ఉక్కునగరం: జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఈరోజు..రేపు అంటూ ఆశలు రేపుతున్నారే తప్ప చేతికి జీతం అందడం లేదు. గత నెల 30న కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పర్యటించిన నేపథ్యంలో జీతాలను రెగ్యులర్ చేయడంపై స్పష్టత వస్తుందని ఉద్యోగులు ఎదురు చూశారు. అయితే కేంద్ర మంత్రి కుమారస్వామి, ఎంపీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తులను మన్నించకుండా రెండు, మూడు నెలలు అంటూ దాటవేశారు. ఇచ్చే ఆ పర్సంటేజీ జీతమైనా మొదటి వారంలో వేస్తే కనీసం రుణాలకు డిఫాల్టర్‌గా మారకుండా ఉంటామని ఉద్యోగులు భావిస్తున్నారు. అయితే ఈ నెలలో ఇప్పటి వరకు జీతం వేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్పత్తి, అమ్మకాలు జోరుగా ఉన్నా.. కేంద్రం నుంచి ప్యాకేజీ వచ్చినా కనీసం నెల జీతం సక్రమంగా అందకపోవడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



పాతకిన్నెర్లలో తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండలంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో కొత్తపాలెం పంచాయతీ పరిధిని పాతకిన్నెర్ల, లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో గల చెరుకుంపాకలు (పాతవీధి)గ్రామాలను ఆదివారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకాలను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి పథకాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఈ కారణంగా సుదూరంలో ఉన్న ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నామని, మండుటెండలో ఊటగెడ్డల నుంచి నీరు మోసుకువచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యేకు సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు వెంటనే పాడేరు తాగునీటి సరఫరా విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జవహర్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో మూడు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని డీఈఈ తెలిపారు.స మస్య పరిష్కారం కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గ్రామస్తులకు తెలిపారు.

కమనీయం.. కేశవస్వామి కల్యాణం

కనులపండువగా స్వామివారి బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవస్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చోడవరం: శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవ స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి 752వ. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం పాటు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలోభాగంగా స్వామివారి కల్యాణం శనివారం అర్ధరాత్రి అంగరంగవైభవంగా జరిగింది. కల్యాణాన్ని చూసేందుకు వందలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం పెళ్లిసందడి నెలకొంది. ప్రత్యేకంగా రకరకాల పండ్లు, పూలతో అలంకరించిన కల్యాణ మండపంలో శ్రీదేవి,భూదేవి సమేతుడైన శ్రీ కేశవస్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా కల్యాణాన్ని జరిపారు. ఆస్థాన అర్చకులైన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. గోవిందా...గోవింద అంటూ కల్యాణవేదిక ప్రాంగణమంతా మారుమోగింది. స్వామివారి తరపున తాళిబొట్టును శ్రీదేవి, భూదేవికి వేసి, ముత్యాల తలంబ్రాలు వేసి కల్యాణం కమనీయంగా జరిపారు. పట్టువస్త్రాలు ధరించిన జంటలు ఈ కల్యాణంలో పాల్గొని స్వామివారికి కల్యాణం జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చన చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు బృందం పురందరదాసు కీర్తనలు ఆలపించారు. సరిపల్లి భ్రాత్రమ్మ, పావని అన్నమయ్య సంగీతఝురి ఆధ్వర్యంలో సంపూర్ణ సుందరకాండ పారాయణం చేశారు.

వాల్తేరు డిపో ఉద్యమం ఆదర్శనీయం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

మద్దిలపాలెం: విశాఖ జిల్లా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్తేరు డిపోలో చేసిన ఉద్యమం రాష్ట్రంలోనే ఆదర్శమైందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి అన్నారు. ఎఅసోసియేషన్ సెంట్రల్ కమిటీ తీసుకున్న తీర్మానం మేరకు ఆదివారం డిపో యూనియన్ ఆఫీస్‌లో రీజినల్ మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం నైట్ అవుట్ అలవెన్స్‌లను ఇప్పించిందని గుర్తు చేశారు. జిల్లా మహాసభలో నూతన రీజినల్ సెక్రటరీగా గాజువాక డిపో సెక్రటరీ పిల్లా శంకరరావు, రీజినల్ అధ్యక్షుడిగా పి.ఎస్.మూర్తి(మద్దిలపాలెం డిపో) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జోనల్ కార్యదర్శిగా మూర్తి, రాష్ట్ర కోశాధికారి మోహన్, రాష్ట్ర కార్యదర్శులు అప్పారావు, రావు, జోనల్ అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి జోనల్ కార్యదర్శిగా రాములు, జోనల్ చైర్మన్ సూర్యం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నీలకంఠం, వాల్తేర్ డిపో అధ్యక్ష కార్యదర్శులు వసంత రావు, స్టీల్ సిటీ సెక్రటరీ సాయిరాం, సింహాచలం డిపో అధ్యక్ష కార్యదర్శులు నాయుడు, రాజు, మద్దిలపాలెం అధ్యక్షుడు చిన్న, విశాఖ డిపో అధ్యక్షుడు ఎ.ఎ. రావు, మధురవాడ సెక్రటరీలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నేరాలను ఉపేక్షించం..

- మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం
- డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

అల్లిపురం(విశాఖ) : విశాఖ నగరంలో క్రైమ్ రేటు పెరిగితే ఉపేక్షించేది లేదని, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశించారు. ఆదివారం ఆయన నగర పోలీస్ కమిషనరేట్‌లో గల నూతన సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో రౌడీయిజానికి తావులేకుండా చూడాలన్నారు. పోలీసింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అలాగే కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ విభాగాల పరితీరుపై పీపీటీ ద్వారా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వివరించారు. అనంతరం డీజీపీ పోలీస్ అధికారుల నుంచి అర్జీలను స్వీకరించారు. త్వరలోనే అర్జీలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ డీసీపీ–1 అండ్ 2, అడ్మిన్ డీసీపీ, క్రైం డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ట్రోపెక్స్-25 విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న నేవీ యుద్ధనౌకలు

సింధియా: హిందూ మహాసముద్రం ప్రాంతంలో రక్షణ, భద్రత వ్యవస్థల బలోపేతంలో భాగంగా ట్రోపెక్స్–25 విన్యాసాలు కొనసాగుతున్నట్లు తూర్పునావికాదళ అధికారులు తెలిపారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు మాసాలపాటు వివిధ దశల్లో నిర్వహించే ఇండియన్ నేవీ థియేటర్ స్థాయి కార్యాచరణ వ్యాయామం ట్రోపెక్స్–25లో భాగంగా ప్రస్తుతం హిందూమహాసముద్రంలో భారత నేవీ, ఆర్మీ, వైమానిక, కోస్టుగార్డ్ దళాలు తమ ఆయుధ సంపత్తిని, సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయన్నారు. ఈ విన్యాసాలు భారతీయ నేవీ ప్రధాన యుద్ధ నైపుణ్యాలను ధృవీకరించడంతో పాటు, సముద్ర వాతావరణంలో అసమాన, హైబ్రిడ్ బెదిరింపులకు వ్యతిరేకంగా జాతీయ సముద్ర భద్రతా ప్రయోజనాలను సంరక్షించేందుకు దోహదపడతాయన్నారు. ట్రోపెక్స్–25లో సుమారు 65 భారత నావికాదళాలు, 9 జలాంతర్గాములు, 80కి పైగా వివిధ రకాల విమానాలు పాల్గొంటున్నట్లు నేవీ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

గిరి పుత్రులకు 'కరెంట్' షాక్

- రూ.1.60 లక్షలు విద్యుత్ బిల్లుతో గుండెలు బాదుకున్న గిరిజన కుటుంబం
- డోలవానిపాలెంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు
- ఆగ్రహం చెందుతున్న గిరిజనులు



నాగరాజు కుటుంబానికి రూ.27 వేలకుపైగా అందించిన కరెంట్ బిల్లు

రావికమతం : గిరిజన తండాలో ఉచిత కరెంట్‌కు మంగళం పాడేలా కూటమి సర్కార్ చర్యలు చేపట్టింది. 200 యూనిట్లు వరకు గిరిజనులకు ఉచిత విద్యుత్ అందించాల్సివుండగా అమాయక గిరిజనులకు రూ.లక్షలు, వేలల్లో బిల్లు లు అందించి వారిని షాక్ కు గురయ్యేలా చేసింది. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం డోలవానిపాలెం గ్రామానికి చెందిన డోలా సత్తిబాబుకి రూ.లక్షా 60 వేలు బిల్లు అందించారు. సత్తిబాబు ఇంటి వద్ద లేకపోగా కరెంట్ బిల్లు అందుకున్న అతని తల్లి లక్ష్మి రూ.లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లును చూసి గుండెలు బాదుకుంటూ ఇదేమి మోసమంటూ ఆవేదన చెందింది. ఇదే గ్రామానికి చెందిన గాది నాగరాజుకు చెందిన సర్వీస్ నెంబర్ 11564జి364000004కు రూ, 27,913 బిల్లు అందించారు. ఇదేవిధంగా ఆ గ్రామంలో పలువురికి రూ.వేలల్లో బిల్లులు రావడంతో గిరిజనులు ఆగ్రహం చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించకపోతే ఆందోళనకు దిగుతామని డోలవానిపాలెం గ్రామస్తులు హెచ్చరించారు.



విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో ఆగ్రహం చెందుతున్న డోలవానిపాలెం గ్రామ గిరిజనులు

అంతుచిక్కని వ్యాధితో పశువుల మృతి

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి పంచాయతీలోని పణుకురాతిపాలెం,వేటమామిడి గ్రామాల్లో అంతుచిక్కని అనారోగ్యంతో పశువులు మృతి చెందుతున్నాయని ఆయా గ్రామాల పశు యజమానులు తెలిపారు. వారం రోజుల క్రితం తన మూడు పశువులు మృత్యువాత పడ్డాయని పణుకురాతిపాలెంకి చెందిన మామిడి రామిరెడ్డి చెప్పారు.హఠాత్తుగా నీరసించిపోయి కదల్లేని స్థితికి చేరి, నోటి వెంట చొంగ కారుస్తూ చనిపోయినట్టు తెలిపారు. వేటమామిడిలో ఆదివారం జాతీయరహదారిపై మరో పశువు మృతి చెందింది. ఆ పశువు ఎవరిదో గుర్తించలేదని గ్రామస్తులు తెలిపారు. పశువులు మృతి చెందుతుండడంతో పశు యజమానులను ఆందోళన చెందుతున్నారు.ఈ విషయం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ గణేష్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.పశువుల మృతికి కారణాలు గుర్తించి, వైద్యసేవలందిస్తామని తెలిపారు.



వేటమామిడిలో ఆదివారం మృతి చెందిన పశువు